
ఈవారం కథ



# నమ్మకం

**రాంచీ దగ్గర మెస్రాలో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీఫార్మసీ చదువుతున్నాను. అది నా అదృష్టం. ఎందుకంటే అక్కడ సీటు రావాలంటే తెలివి, కృషిలతోపాటు అదృష్టం కూడా జతకావాలి.**

అయితే నేను అదృష్టం మీద ఆధారపడే వాణ్ణి కాదు. Fortunes favour the brave అన్నది నాకు శిలాశాసనం. కానీ దేశంలో క్రీమ్ అనతగ్గవారుండే ఈ సంస్థలో కూడా ఎందరో విద్యార్థులు జోస్యాన్ని నమ్మడం ఆశ్చర్యం. కొంద రైతే హాబీగా హస్తసాముద్రికాన్ని అభ్యసిస్తూంటారు. వాళ్ళ ముందు చేతులు చాపి ఎందరో నిలబడు తూంటారు.

నేను వాళ్ళకు దూరంగా వుంటాను. కానీ ఒకరోజు నా మిత్రుడు నన్ను బలవంతపెట్టాడు. అప్పుడు నేను చిరాగ్గా, "భవిష్యత్తు మన చేతుల్లో వుంది. చేతల్లో వుంది! చేతిలోని గీతలకు భవి ష్యత్తుని అంటగట్టవద్దు" అన్నాను.

అప్పుడు మా కెదురుగా చతుర్వేది వున్నాడు. అతడు హస్తసాముద్రికంలో ఎంత పేరు తెచ్చు కున్నాడంటే కొందరు ప్రొఫెసర్లు కూడా అతడి ముందు చేతులు పాచి నిలబడతారు. కంప్యూ టర్ ఇంజనీరింగ్ ఫైనలియర్లో వున్నాడతడు. నా వంక అదోలా చూసి, "భవిష్యత్తు తెలుసుకో వాలని అందరికీ వుంటుంది. కానీ అది తెలు సుకుని తట్టుకోగల ధైర్యం అందరికీ వుండదు. అలాంటివాళ్ళే జోస్యాన్ని నిరసిస్తారు" అన్నాడు.

ఇది నాకు సవాలయింది. అతడి ముందు చేయి చాపాను.

చతుర్వేది పట్టి పట్టి నా అరచేతి గీతల్ని పరిశీ లించాడు. అతడి కళ్ళు పెద్దవయ్యాయి, "నువ్వు చాలా తెలివైనవాడివి. తలచుకుంటే నువ్వు సాధించలేనిది లేదు. సంగీతం, చిత్రలేఖనం, కవిత్వం అన్నీ నీకు సహజంగా వస్తాయి..." అంటూ మొదలుపెట్టి అందరికీ తెలిసినవి, తెలి యనివి కూడా అయిన ఎన్నో గొప్ప గుణాలను నేను కలిగి వున్నట్లు చెప్పాడు. అతడు చెప్పినవి చాలా వరకూ సరిపోవడం నాకాశ్చర్యమయింది. చిట్టచివర చతుర్వేది, "అన్నీ బాగానే వున్నాయి కానీ నీకు ధనయోగం లేదు. నీ జీవితమంతా డబ్బు ఇబ్బందులతోనే గడుస్తుంది" అన్నాడు.

షాక్ తిన్నాను. నాకు బాగా డబ్బు సంపాదించా లని కోరిక. మా నాన్నగారు చిన్నతనంలో డబ్బుకు ఇబ్బందిపడి ఇప్పుడు స్వయంకృషితో లక్షాధికారి అయ్యారు. కోటీశ్వరుణ్ణి కావాలని నా కోరిక. ఆ కోరికే నాకు జీవితం పట్ల ఆసక్తిని పెంచుతోంది.

చతుర్వేది అన్ని విషయాలూ సరిగ్గా చెప్పాడు. ఇదొక్కటే తప్పుతాడా? తప్పితే బాగుండును.

జోస్యం ఊహల్లోంచి పుట్టిన శాస్త్రం. చతుర్వేది కాకతాళీయంగా కొన్ని సరిగ్గా చెప్పినంత మాత్రాన జోస్యం సైన్సు అయిపోదు. అదీకాక జరిగింది చెప్పడం వేరు, జరుగబోయేది చెప్పడం వేరు. జోస్యాన్ని నమ్మకూడదు.

ఇలా ఎంత సమర్థించుకుందామన్నా నన్ను నిరుత్సాహం పట్టి కుదపడం మానలేదు. ఎన్ని కళలుంటేనేం, ఎంత సామర్థ్యం వుంటేనేం - డబ్బు లేకపోతే ఆ జీవితం వృధా! నా జీవితం వృధా అని నాకు తోచసాగింది.

మనసులో ఇలా మధనపడుతున్నా పైకి మాత్రం నేను జోస్యాన్ని నిరసిస్తూనే వున్నాను. చతుర్వేది గురించి వాకబుచేస్తూ అతడెవరికైనా తప్పు చెబితే సంతోషిస్తూ, రైటు చెబితే గాభరాపడేవాణ్ణి. కానీ నేను గాభరాపడ్డ సందర్భాలే ఎక్కువ!

జె. శ్రీరామకమల్

ఆ తర్వాత నుంచి నేను హస్తసాముద్రికంతో అంతో ఇంతో ప్రవేశమున్న ప్రతి ఒక్కడికీ చేయి చూపించుకోసాగాను. నాలోని ఈ మార్పుకు నా మిత్రుడాశ్చర్యపడితే, "నేను జోస్యం తప్పని సైంటి ఫిక్‌గా ఋజువు చేయదల్చుకున్నాను. నాకు ఎవ రెవరు జోస్యం చెప్పారో, ఏమేమి చెప్పారో ఒక పుస్తకంలో వ్రాస్తున్నాను. చాలావరకూ పరస్పర విరుద్ధంగా వుంటున్నాయి. ప్రతి ఒక్కరూ కొన్ని రైటు చెబుతున్నారు. కొన్ని తప్పు చెబుతున్నారు" అని చెప్పాను.

"అయితే మొత్తం ఎన్ని శాంపుల్స్ చూద్దామని?" అనడిగాడు మిత్రుడు.

"వెయ్యి" అన్నాను. అప్పటికింకా పది శాంపిల్సే అయ్యాయి.

"అయితే నీ ఋజువుకు చాలా కాలం పడు తుంది" అన్నాడు నా మిత్రుడు.

కానీ అంతకాలం అవసరం లేకపోయింది. ఇంటర్ కాలేజి మ్యూజిక్ పోటీలలో పాల్గొనేం దుకు ఎక్కణ్ణించో వచ్చాడు లక్ష్మణరావు. అత గాడు హస్తసాముద్రికంలో కాకలు తీరినవాడుట. అరచేతి ముద్రలు చూసి అజారుద్దీన్ ఇండియాకు కెప్టెన్ అవుతాడనీ, పీవీ నరసింహారావు భారత ప్రధాని అవుతాడనీ చెప్పాడుట.

నా మిత్రుడు, నేను లక్ష్మణరావు వద్దకు వెళ్ళాం. అతడు నా గురించి విన్నాడు. నాతో, "కొందరు మిడిమిడి జ్ఞానంతో వచ్చీరానివి చెప్పి జోస్యం పరువు తీస్తున్నారు. నేను నీకు ఇచ్చి

తంగా చెప్పి జోస్యాన్ని నమ్మేలా చేస్తాను" అన్నాడు.

అతడి ముందు చేయి సాచాను. "నీలో లలిత కళల పట్ల తపన వుంది. కానీ ఒక్కటే అబ్బదు నీకు. అయితే ఏం రెండు చేతులా ఆర్జిస్తావు. నీ ఆస్తి నీకే తెలియనంతగా పెరిగిపోతుంది" అన్నాడు లక్ష్మణరావు.

నా ఆనందం పట్టలేను. లలితకళల విషయంలో లక్ష్మణరావు తప్పు చెప్పాడని నాకు బాధగా లేదు. నా జీవితాశయం డబ్బు సంపాదించడం...

లక్ష్మణరావు నా చేయి చూడడం అయ్యాక, "జోస్యం మనిషికెంతో మేలు చేస్తుంది. దాన్ని తప్పని ఋజువు చేయడానికి పూనుకోవడం మంచి పని కాదు. నీ హస్తరేఖల్ని బట్టి చెబుతున్నాను. నీవిక జోస్యాన్ని నిరసించే ప్రయత్నం మానేస్తావు" అన్నాడు.

అతుడు వెళ్ళిపోయాక నా మిత్రుడు నవ్వి, "ఇతగాడింకా శాంపిల్ నెంబర్ పదకొండు. అప్పుడే శాంప్లింగ్ మానేస్తావని ఇంకో తప్పు చెప్పాడు" అన్నాడు.

"అతడు తప్పు చెప్పలేదు. నేను నా శాంప్లింగ్ డిస్కంటిన్యూ చేస్తున్నాను" అంటూ అంతవరకూ సేకరించి వ్రాసుకున్న వివరాలు కూడా చించి పారేశాను. ఆశ్చర్యపడ్డ మిత్రుడికి నేనింకేమీ చెప్పలేదు.

జోస్యం ఎంత బలమైనదో నాకప్పుడర్థమయింది. ఒక జ్యోతిష్కుడు నాకు అప్రియమైన విశేషం చెబితే అది ఖండించడానికి మరో జ్యోతిష్కుడు అవసరం. చతుర్వేది మాటలు విని నేనెంతగా బలహీనపడ్డానంటే జోస్యాన్ని నిరసించే మిషతో నేను నాకు ప్రియమైన విశేషం మరో జ్యోతిష్కుడి ద్వారా వినాలని ప్రయత్నిస్తున్నానన్న మాట!

అది తెలిసే లక్ష్మణరావు నన్ను ట్రిక్ చేశాడా అన్న అనుమానం కూడా నాకు లేకపోలేదు.

అయితేయేం - ఇక నేను పొరపాటున కూడా ఏ జ్యోతిష్కుడి ముందూ చేయి చాపదల్చుకోలేదు. అయినా లలిత కళల్లో సహజ సామర్థ్యమున్నవాణ్ణి, రెండు చేతులా ఆర్జించబోతున్నవాణ్ణి - నాకు భవిష్యత్తు గురించి తెలుసుకోవాల్సిన అవసరమేముంది?

◇

తెలుగు కళాసమితి, న్యూజెర్సీ కార్టూన్ల పోటీలో బహుమతి పొందిన కార్టూన్లు

